క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది

పెద్దకడబూరు: మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామానికి చెందిన మడ్డి హనుమంతు సోమవారం అనారోగ్యంతో చనిపోయాడు. ఈ మేరకు మంగళవారం మట్టి ఖర్చుల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు సర్పంచ్ చంద్రశేఖర్, వెల్ఫేర్అసిస్టెంట్ మహబూబ్‌బాషా రూ. 10వేలు అందించారు. మిగిలిన రూ. 90వేలు నామినీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని వారు తెలిపారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గజేంద్రరెడ్డి, సచివాలయ పంచాయతీ కార్యదర్శి నరేంద్రగౌడ్, డిజిటల్ అసిస్టెంట్ సురేంద్ర పాల్గొన్నారు.

ఆర్‌టీఐ బోర్డులు ఏర్పాటు చేయండి

పెద్దకడబూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఆర్‌టీఐ బోర్డులను ఏర్పాటు చేయాలని సీసీఆర్(కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్) కమిటీ సభ్యులు హనుమంతు, తిక్కన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీసీఆర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులకు వారు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం – 2005 ప్రకారం ప్రతి కార్యాలయాలలో బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దారు, ఎంపీడీఓ, ఎంఈఓ, ఎంఏఓ కార్యాలయాలతో పాటు ఇతర కార్యాలయాలలో ఆర్‌టీఐ బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీసీఆర్ కమిటీ సభ్యులు దేవరాజు, గురుమూర్తి, శివకృష్ణయాదవ్, తాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనిదినాలు పెంచాలి



ఏపీఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కోసిగి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనిదినాలు 250 రోజులకు పెంచాలని ఏపీ రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు గోపాల్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు లోకేష్, సీపీఐ మండల అధ్యక్ష, కార్యదర్శిలు తాయన్న ఉలిగయ్య కోరారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీ రైతు సంఘం నాయకులు ఏపీఓ జయరాంకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిచేసిన కూలీలకు వేతనాలు పెండింగ్‌లో ఉంచకుండా ప్రతివారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మూకప్ప, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులు పూర్తి చేయండి



సచివాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి

ఆదోని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నాడు–నేడు కింద చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల భవన నిర్మాణం పనులను త్వరిగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. మంగళవారం మండలంలోని సాంబగల్, చిన్నపెండేకల్ గ్రామాల్లో ఆమె పర్యటించారు. స్కూల్ గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అదేవిధంగా సచివాలయాల తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, సర్పంచ్ చిలక జయరాముడు, వలంటీర్లు పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం స్వాధీనం



సబ్సిడీ బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు

ఆదోని రూరల్ : ఆస్పరి రోడ్డులోని ఎస్‌వీఎల్‌ఐ జిన్నింగ్ మిల్ ఎదురుగా ఉన్న పొట్టేలు ఫారంలో అక్రమంగా నిల్వ ఉంచిన 45.70 క్వింటాళ్ల(106 సంచులు) రేషన్ బియ్యాన్ని మంగళవారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్ఐ హనుమంతు, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు నిందితులు రాజశేఖర్, వినోద్, వీరేష్‌పై కేసు నమోదు చేసి బియ్యాన్ని తాలూకా పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు తాలూకా ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు.

అట్టడుగు వర్గాలకు అండగా ప్రభుత్వం

- మాచాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం
- పాల్గొన్న మంత్రి గుమ్మనూరు జయరాం
- నిరాజనం పలికిన గ్రామస్తులు



మాచాపురంలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: అట్టడుగు వర్గాల ప్రజలకు అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. దేవనకొండ మండలం మాచాపురం గ్రామంలో సర్పంచ్ అమరావతి లక్ష్మిదేవి ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. గ్రామంలో అన్ని కులాలకు చెందిన 2,112 మంది లబ్దిదారులకు రూ. 5,18,87,749 మేర సంక్షేమ పథకాలను మూడున్నరేళ్ల కాలంలో మంజూరు చేసినట్లు వివరించారు. ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబానికి అందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్ అందజేశారు. గ్రామంలో పలు కాలనీలలో తాగునీటి ఎద్దడి తీర్చాలని గ్రామస్తులు మంత్రిని కోరారు. స్థానిక సచివాలయానికి మంజూరైన నిధులలో రూ.5 లక్షలతో తాగునీటి సమస్య పరిష్కరించాలని, అలాగే డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిదేవి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మెన్ హంపిరెడ్డి, తెర్నెకల్ సర్పంచ్ అరుణకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు నిజాల్‌రెడ్డి, మన్‌మోహన్‌రెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, దివాకర్‌నాయుడు, నారాయణరెడ్డి, తహసీల్దార్ సుదర్శనం, ఎంపీడీఓ గౌరీదేవి, ఏఓ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరు

ఆలూరు: వైఎస్సార్‌సీపీ హయాంలో గడిచిన మూడున్నరేళ్లలో ఆలూరు నియోజకవర్గంలోని 270 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.60 కోట్లు ఖర్చు చేసినట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. దేవనకొండ మండలం మచాపురం ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం రూ.30 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. గత పాలకులు ప్రభుత్వ పాఠశాలలో కనీస సదుపాయాలు కల్పించలేకపోయారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటూ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారని కొనియాడారు. విద్యార్థులకు సాంకేతిక విద్య కోసం బైజూస్ ఒప్పందంతో ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. అన్ని వర్గాలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అర్థరహితంగా విమర్శలు చేయడాన్ని మంత్రి తప్పుపట్టారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ నేతలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని తేల్చిచెప్పారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మన బడి నాడు-నేడు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం దర్గాలో ప్రత్యేక ఫాతేహాల్ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, వైస్ ఎంపీపీ నడిపి షేక్ సాహెబ్, సర్పంచ్ మద్దీశ్వరి, ఎంపీటీసీ సుశీలమ్మ పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాత్రి చెక్క భజనలు, పంచమాంకములు పౌరాణిక నాటకం, తత్త్వ విచారణలు చేపట్టారు. దర్గాను విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భూహక్కు పత్రాల పంపిణీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి గ్రామ సచివాలయంలో మంగళవారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం పత్రాలను తహసీల్దార్ జయన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందన్నారు. సర్వే పూర్తైన గ్రామాల్లోని రైతులకు భూ హక్కు పత్రాలను అందజేస్తున్నారన్నారు. సర్వే చేసే సమయంలో రైతులు తమ పొలాల వద్ద ఉంటే సమస్యలు రావని తెలిపారు. ఇక నుంచి భూ రికార్డులు పక్కాగా ఉంటాయన్నారు. అనంతరం రీసర్వే పూర్తయిన రైతులకు భూహక్కు పత్రాలను అందజేశారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి సుధ

ఆదోని రూరల్: రాజీ మార్గాన్ని ఎంచుకుని ఫిబ్రవరి 11న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రెండో జిల్లా అదనపు కోర్టు జడ్జి శ్రీమతి పి.జె.సుధ సూచించారు. ఈ మేరకు స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం అన్ని ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్ కంపెనీల మేనేజర్‌లు, అడ్వకేట్‌లు, ఫైనాన్స్ కంపెనీ అడ్వకేట్లతో జడ్జి సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయడం గురించి చర్చించారు. వారివారి సమస్యలను జడ్జి అడిగి తెలుసుకున్నారు. రాజీయే రాజమార్గమని, ఇరువురు ఒప్పుకుంటే రాజీ చేసుకోవాలని సూచించారు.

ఈరన్న స్వామి ఆలయానికి ప్రింటర్ విరాళం



సిబ్బందికిప్రింటర్‌ను అందజేస్తున్న దాతలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుందలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయానికి హైదరాబాద్‌కు చెందిన విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. దేవస్థాన టిక్కెట్ బుక్కింగ్ కౌంటర్‌కు అవసరమైన టీవీఎస్ ఎలక్ట్రికల్ ప్రింటర్‌ను విరాళంగా ఇచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసి సహకరించాలని వాణి కోరారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించండి



ఎంపీడీఓ వెంకటరమణప్పకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దకడబూరు : కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి ఆనందరాజు, సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న డిమాండ్ చేశారు.టీ మేరకు మంగళవారం మండల కేంద్రం పెద్దకడబూరులోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశానంలో గుంతలు తీసే కాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఉపాధి కల్పించాలన్నారు. వృత్తి పరికరాలతో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, ఉచితంగా బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ వెంకటరమణప్పకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో కాటికాపరులు లాజరు, ఇమ్మానిల్, యేసేపు, అల్లప్ప, బాబు, రత్నయ్య, కర్రెన్న తదితరులు పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

ఆదోని రూరల్ : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యండీ ఆనంద్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట సబ్ ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలుతోపాటు రాయలసీమ యూనివర్సిటీలో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇస్మాయిల్, వెంకటేశ్వరరావులను ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు ధర్నా చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహాన్ని పాలతో కడిగి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. దళిత గిరిజనుల జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించడంలోనూ, కేటాయించిన నిధులను ఖర్చు చేయడంలోనూ వివక్ష చూపారన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు లింగన్న, నగర నాయకులు సతీష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబసుకు నివాళి



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్ : స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఎం నేత, పశ్చిమబెంగాల్ దివంగత ముఖ్యమంత్రి కామ్రేడ్ జ్యోతిబసు 13వ వర్ధంతిని మంగళవారం సీపీఎం సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు మహానందరెడ్డి, సీపీఎం పట్టణ మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న తదితరులు జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సుధీర్ఘకాలం పాటు పనిచేసి రికార్డు సొంతం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, క్రిష్ణమూర్తి, శ్రీనివాసులు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసిందని, గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీహెచ్ఓ బలరాం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు ఓఈఈఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకునేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు త్వరల్లో ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. గర్భిణు లు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని ఆశా వర్కర్లకు సూచించారు. పీహెచ్ఎన్ లక్ష్మిదేవి, హెల్త్ సూపర్‌వైజర్ ఈరమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరా



ఈరన్న స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామిని మంగళవారం రాత్రి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను అర్చకులు మల్లయ్యస్వామి, శివన్నస్వామి, నాగరాజ్‌స్వామి, ఈరన్నస్వామి శాలువ, పూలమాలతో సన్మానించారు. దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే అర్చకులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ వీరేష్, నాయకులు అయ్యప్ప, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనం అనంతరం బుదుములదొడ్డి ఆంజినేయస్వామిని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దర్శించుకున్నారు. ముందుగా అర్చకులు ఎమ్మెల్యే స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను అర్చకులు సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

22 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: స్థానిక సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రంలో ఈ నెల 22వ తేదీ నుంచి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి 17వ వార్షికోత్సవం, శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర శర్మ తెలిపారు. 22న లక్ష్మీగణపతి హోమం, శేష వాహన సేవ, 23న రుద్ర, లక్ష్మీ కుబేర హోమం, అశ్వ వాహన సేవ, 24న మన్యుసూక్త హోమం, లక్ష్మీ కుబేర హోమం, సింహ వాహన సేవ, 25న నారాయణ, ధన్వంతర హోమం, హనుద్వాహన సేవ, 26న సరస్వతి హోమం (వసంత పంచమి), గరుడ వాహన సేవ, 27న సుదర్శన హోమం, గజవాహన సేవ, 28న అరుణ హోమం (రథ సప్తమి), 29న నవగ్రహ హోమం, హంస వాహన సేవ, 30న చంద్ర ప్రభ వాహన సేవ, 31న పంచ సూక్త హోమం , దివ్యమంగళ రథోత్సవం, ఫిబ్రవరి 1న ధ్వజారోహణం, చక్రస్నానం కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

26 నుంచి రథ సప్తమి వేడుకలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఆలయ చతుర్థ వార్షికోత్సవం, రథ సప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. 26న గోపూజ, 27న లలితా సహస్రనామ హోమం, 28న అరుణ హోమం, 29న శ్రీ ఛాయాఉషా సమేత శ్రీ సూర్యనారాయణ స్వా మి కల్యాణోత్సవం,30న రాజశ్యామల హోమం కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు: కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి కోడుమూరుకు ఏపీ 21 ఎక్స్ 1949 కారులో మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి, కారును స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. దేవనకొండ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దేవనకొండ ఎస్ఐ భూపాలుడు, సిబ్బంది రాత్రి కరివేముల గ్రామ శివారులో వాహన తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కారును తనిఖీ చేయగా అందులో 25 బాక్సుల కర్ణాటక మద్యం ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ 24,500 ఉంటుందని అధికారులు తెలిపారు. మద్యం అక్రమంగా తలిస్తున్న మహేంద్ర, పక్కిరహుసేన్ బాషాను అరెస్ట్ చేసి పత్తికొండ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. దాడులలో పోలీసులు చెన్నయ్య, రవి, దస్తగిరి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేవర ఉత్సవాలు ప్రారంభం

మద్దికెర: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో దేవర ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు ప్రత్యేకంగా చేయించిన పంచలోహ ముఖం, నాగ పడగతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. 14 ఏళ్ల తరువాత గ్రామ శాంతి కోసం దేవర ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కృష్ణగిరి: క్రీడాపోటీల్లో పాల్గొనడం వల్ల ఉల్లాసంగా ఉంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, హుసేన్‌సాహెబ్ అన్నారు. కృష్ణగిరిలో దివంగత నేత చెరుకులపాడు నారాయణరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా చదువు కంటే ముందుగా క్రీడల వల్లే గుర్తింపు వస్తుందన్నారు. మారుమూల గ్రామాల్లోనూ క్రికెట్‌కు ఎంతో ఆదరణ ఉందన్నారు. క్రీడల్లో రాణించే వారిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పోత్సాహించాలన్నారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నీలో 16 జట్లు పాల్గొనగా కృష్ణగిరి సీనియర్, కృష్ణగిరి కేవీఆర్ జట్లు మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు శివారెడ్డి, మహేష్, మనోహర్, హరీష్‌రెడ్డి తెలిపారు. గెలుపొందిన జట్లకు రూ.10,016, రూ. 5,016 నగదు బహుమతులు అందజేశారు. నాయకులు బాల మద్దయ్య, సంజన్న, చిన్నషాలు, తిరుపాల్‌యాదవ్, వడ్డె సత్యం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మదార్‌పురం జట్టు



విజేత మదార్‌పురం జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న పెనికలపాటి జయరాముడు

వెల్దుర్తి: మండల పరిధిలోని నార్లాపురం గ్రామంలో సంక్రాంతి వేడుకలు, పెనికలపాటి రేణుకమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన సూపర్ 8 క్రికెట్ టోర్నీలో మదార్‌పురం లక్ష్మన్న జట్టు విన్నర్‌గా నిలిచింది. ఈనెల 12న ప్రారంభమైన టోర్నీలో 34 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం జరిగిన ఫైనల్‌లో కృష్ణగిరి మండలం అమకతాడుకు చెందిన మిన్నల్ల ఎలెవెన్ జట్టుపై మదార్‌పురం జట్టు గెలుపొందింది. ఆ జట్టు తరపున బబ్లు హ్యాట్రిక్ వికెట్లు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. టోర్నీలో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా మదార్‌పురం సాయిచరణ్, బెస్ట్ బౌలర్‌గా అమకతాడు చక్రి ఎంపికయ్యారు. విజేత జట్టుకు ట్రోఫీ, రూ.10,016 నగదు బహుమతిని పెనికలపాటి జయరాముడు ప్రదానం చేయగా, రన్నర్స్ అమకతాడు జట్టుకు నిర్వాహకులు వినయ్, నరసింహ, భాస్కర్, పాండు తదితరులు ట్రోఫీ, రూ.5,016 అందించారు. నార్లాపురం రజిని, గ్రామస్తులు పాల్గొన్నారు.



నదిలో సంచరిస్తున్న మొసలి

తుంగభద్ర నదిలో మొసలి

కౌతాళం: మరళి గ్రామ సమీపంలోని తుంగభద్ర నది ఒడ్డున మంగళవారం మొసలి సంచరించడంతో అటుగా వెళ్లేందుకు రైతులు, కూలీలు భయాందోళన చెందుతున్నారు. నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

31న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామ సమీపంలోని కొండపై వెలసిన దస్తగిరయ్య స్వామి ఉరుసు సందర్భంగా ఈ నెల 31వ తేదీన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ బహుమతి రూ.12 వేలు, మూడవ బహుమతి రూ.8 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలను దాతల సహకరంతో అందించనున్నట్లు వారు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఉదయం 8 గంటలలోపు రూ.400 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారు తమ పేర్లు నమోదుకు 79937 60575, 93980 34565 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

24న సుంకులమ్మవ్వ దేవర

ఆస్పరి: మండలలలోని యాటకల్లు గ్రామంలో ఈనెల 24, 25 తేదీల్లో సుంకులమ్మవ్వ, దుగ్గెమ్మవ్వ దేవర నిర్వహించనున్నట్లు సర్పంచ్ సుధమ్మ, గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. అమ్మవారి ఆలయాలలో ప్రత్యేక పూజలు, కుంభాల ఊరేగింపు, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.